సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 17 । జూన్ । 2023



రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు

రైల్వే సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వహించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని గుంతకల్లు డీఆర్‌ఎం తెలిపారు. - 8లో



నాడు ఘనం.. నేడు దైన్యం

పట్టురైతులకు అత్యంత విలువైన సేవలందించిన బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్ మూలబీజ క్షేత్ర కేంద్రం మూతపడి ప్రాభవాన్ని కోల్పోయింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.340
రెండోరకం	రూ.200	రూ.250



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1365 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	488	531
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 315.80 కిలోలు

న్యూస్‌రీల్

ఈనెలాఖరుకు నాడు-నేడు పనులు పూర్తి కావాలి

రాయచోటి: మనబడి, నాడు–నేడు రెండో విడతకు సంబంధించి అన్ని తరగతి గదులు, ఎలక్ట్రికల్ మరుగుదొడ్ల రిపేర్లు, నూతన వంటగది, మరుగుదొడ్ల నిర్మాణాలు ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మనబడి, నాడు–నేడు పనుల పురోగతిపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, మండల విద్యాశాఖ అధికారులు, ఫీల్డ్ ఇంజినీర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పనులు నత్తనడకన జరుగుతున్న తీరుపై సంబంధిత మండలాల అధికారులను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కార్యాలయ ఏడీ ప్రసాద్ బాబు, సీఎంఓ కరుణాకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసన్న కుమార్, మురళీధర్, డీఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటెక్షన్ వాచర్లకు కిట్లు పంపిణీ



ప్రొటెక్షన్ వాచర్లకు వస్తు సామగ్రి కిట్లు అందజేస్తున్న కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

సిద్దవటం: సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రొటెక్షన్ వాచర్లకు యూనిఫాం, జంగిల్‌షూ, టార్చిలైట్, వాటర్ బాటిల్, గడియారాన్ని కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొటెక్షన్ వాచర్లు విధి నిర్వహణలో అటవీ ప్రాంతంలో తిరిగేటప్పుడు ఇవన్నీ ఉపయోగ పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కడప రేంజర్ ప్రసాద్, సిద్దవటం ఇన్‌చార్జి రేంజర్ కె. ఓబులేసు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, ఏబీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

20న 'మూడు తరాల ప్రజా సారథి' పుస్తకావిష్కరణ



చాపాడు: తన జీవిత చరిత్రపై ప్రచురితమైన 'మూడు తరాల ప్రజా సారథి' పుస్తక ఆవిష్కరణ సభను జయప్రదం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవితం, రాజకీయ ప్రస్థానంపై మూడు తరాల ప్రజా సారథి పుస్తకాన్ని యువ రచయిత తవ్వా వెంకటయ్య రచించారన్నారు. ఈ పుస్తకావిష్కరణ సభ ఈ నెల 20న ఉదయం 9.30 గంటలకు మైదుకూరులోని కేఎస్ కల్యాణ మండపంలో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, రాజకీయ పార్టీల నాయకులు, కవులు, రచయితలు హాజరవుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సూక్ష్మ సేద్యంలో అద్వితీయం

- లక్ష్యానికి మించి డ్రిప్ పరికరాలు పంపిణీ
- రాష్ట్రంలో రెండో స్థానం సాధించిన అన్నమయ్య జిల్లా
- 2022-23 సంవత్సరానికి రూ.92 కోట్లు కేటాయింపు
- బిందు, తుంపర సేద్యాన్ని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

పీలేరు: రైతుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్న సూక్ష్మ సాగునీటి పథకం అమల్లో 2022–23 సంవత్సరానికి అన్నమయ్య జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానం సాధించింది. మైక్రో ఇరిగేషన్ అధికారులు, ఉద్యాన, వ్యవసాయ అధికారుల కృషితో రైతులకు రాయితీతో డ్రిప్ పరికరాలు ఇవ్వడంలో లక్ష్యానికి మించి సాధించి శభాష్ అనిపించుకున్నారు. జిల్లాలో 9700 హెక్టార్లకు డ్రిప్ పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా 10754 హెక్టార్లలో ఏర్పాటుచేసి రాష్ట్రంలో రెండో స్థానం, దేశంలో తొమ్మిదో స్థానం సాధించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో లక్ష్యానికి మించి రైతులకు పరికరాలు ఇచ్చినట్లు అధికారులు వివరించారు. ఇంకా అవసరం ఉన్నా రైతులు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ రాయితీతో సరఫరా చేస్తామని చెబుతున్నారు.





బిందు సేద్యం విధానంలో సాగైన అరటి (ఇన్‌సెట్) డ్రిప్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న మైక్రో ఇరిగేషన్ అధికారి

సబ్సిడీ వివరాలు

బిందు, తుంపర సేద్య పరికరాలకు దరఖాస్తు చేసుకునే రైతులకు భూమి విస్తీర్ణం మేరకు రాయితీ లభిస్తుంది. ఐదెకరాలు లోపు కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులకు 90 శాతం సబ్సిడీతో గరిష్ట పరిమితి రూ. 2.18 లక్షల వరకు, 5 నుంచి 10 ఎకరాలలోపు భూమి కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ రైతులకు 70 శాతం సబ్సిడీతో గరిష్ట పరిమితి రూ. 3.46 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుంది. డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు ఇది వరకే 2022–23 సంవత్సరంలో రిజిస్ట్రేషన్ చేసుకొని ఉంటే కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. అలాంటి వారి రిజిస్ట్రేషన్‌ను 2023–24కు బదిలీ చేసినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా డ్రిప్ పరికరాల పంపిణీ వివరాలు

నియోజకవర్గం	లక్ష్యం (హెక్టార్లలో)	పంపిణీ అయిన విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
కోడూరు	2290	2386	2168
మదనపల్లె	600	708	755
పీలేరు	1430	1565	1395
రాజంపేట	1060	1223	1103
రాయచోటి	2610	2904	2580
తంబళ్లపల్లె	1710	1967	1941
మొత్తం	9700	10754	9942

కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం



రైతు ఆధార్, మొబైల్ నంబరుతో రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలి. ఈ సమయంలో రైతులు ప్రభుత్వ రాయితీ కోసం దరఖాస్తు, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజుఫొటో, టైటిల్ డీడ్ లేదా 1–బీ, ఎఫ్ఎంబీ, బ్యాంకు పాస్‌బుక్, భూమికి సంబంధించి చెక్‌బంది పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

సూక్ష్మనీటి పథకంతో బహుళ ప్రయోజనాలు



సూక్ష్మనీటి పథకంతో రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. నీటి వనరుల కొరత ఉన్న ప్రస్తుత పరిస్థితిలో బిందు సేద్యం పంటలకు, ప్రధానంగా ఉద్యాన పంటలకు ఎంతో ఉపయోగకరం. పంటలకు సమూలంగా నీరందడంతోపాటు నీటి ఆదా అవుతుంది. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేసుకోవచ్చు. డ్రిప్ ద్వారా ఎరువులు పంటలకు సులభతరంగా సమూలంగా వేయవచ్చు. రైతులు సూక్ష్మనీటిసాగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–వెంకటేశ్వరరెడ్డి, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి

హోమ్‌గార్డుల ఐకమత్యం అభినందనీయం



పదవీవిరమణ పొందిన ఎస్.రవిని సన్మానించి చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

రాయచోటి : మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన ఎస్.రవి(హెచ్‌జి 293)కి సాటి హోమ్‌గార్డులు ఒకరోజు వేతనంగా రూ.4 లక్షల ఆర్థికసాయం చేసి తమ ఐకమత్యాన్ని చాటుకున్నారని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అభినందించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి ప్రధాన కార్యాలయంలో హోమ్‌గార్డుకు ఎస్పీ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్‌కమల్, ఏఆర్ డీఎస్పీ పి.మహబూబ్‌బాషా, ఎస్‌బీ సీఐ సత్యనారాయణ, డీసీఆర్‌బీ సీఐ, ఆర్‌ఐలు జావీద్, మహబూబ్‌వల్లి, పెద్దయ్య పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణపై అవగాహన

బి.కొత్తకోట: మండలంలోని గుంతవారిల్లెలో స్పైలాకార తెల్లదోమ ఆశించిన కొబ్బరి తోటలను శాస్త్రవేత్తలు శుక్రవారం సందర్శించారు. సీనియర్ శాస్త్రవేత్త నేషనల్ బ్యూరో ఆఫ్ అగ్రికల్చర్ రిసోర్స్ సంస్థ బెంగళూరుకు చెందిన డాక్టర్ కే సెల్వరాజన్ తెల్లదోమను పరిశీలించి జీవ నియంత్రణ పద్ధతులైన ఎన్కారియా గుడలోపే, ఐసోరియర్య ఫిమేజారియా ఉపయోగించడం ద్వారా సమర్థవంతంగా తెల్ల దోమ నివారించవచ్చన్నారు. ఐసోరియా ఫమసోరియా ఐదు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలికిరి కేవీకే సమన్వయకర్త జిఎస్.పాండురంగా, సీనియర్ శాస్త్రవేత్త, ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ శేష కిరణ్, డాక్టర్ శ్రీనివాసులు, సర్పంచు భీమిగాని నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా వ్యవసాయ సలహామండలి సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహాబోర్డు చైర్మన్ అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. విత్తనాలు, పురుగుమందులు సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు. గ్రామాలలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృత సేవలు అందివ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుకు అవసరమైన అన్ని రకాల నాణ్యమైన ఎరువులు, విత్తనాలను రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తి, విస్తీర్ణం గణనీయంగా పెంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు రైతుకు వెన్నుదన్నుగా ఉండాలన్నారు. పీలేరులో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ అగ్రికల్చర్ ల్యాబ్‌ను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీంద్ర బాబు, సిరికల్చర్ జిల్లా అధికారి రాజశేఖర్, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వర రెడ్డి, జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు దిన్నెపాడు రవిరాజు, బోరెడ వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ, రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహాబోర్డు చైర్మన్

జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జగనన్న సురక్ష కార్యక్రమంపై సంబంధిత అధికారులతో జేసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, భాస్కర్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం

రైతుల సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అడిగిన వెంటనే ఇస్తున్నామన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతుల కోసం అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు.

ఆర్టీసీకి ఆదాయమే

- రూ.22 కోట్లకుపైగా ఆదాయం
- కలిసొచ్చిన వేసవి సెలవులు
- శుభకార్యాలు, విహారయాత్రలకు నడిపిన బస్సులు

మదనపల్లె సిటీ: నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించేందుకు ఆర్టీసీ చేపడుతున్న పలు ప్రత్యేక కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. క్రమక్రమంగా నష్టాల ఊబి నుంచి గట్టెక్కి లాభాల బాట పడుతున్నాయి. మే నెలలో శుభ ముహూర్తాలు, వేసవి సెలవుల నేపథ్యంలో అధిక మంది బస్సుల్లో ప్రయాణించడంతో తిరిగి లాభాల బాట పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నమయ్య జిల్లా పరిధిలో అయిదు డిపోల్లో రూ.22కోట్లకుపైగా ఆదాయం వచ్చింది.

నూతన కార్యక్రమాలతో...

ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు సంస్థ యాజమాన్యం పలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. వీటిలో ముఖ్యంగా కార్మికులు, ఉద్యోగులను ఉత్సాహ పరిచేందుకు ఆదర్శ ఉద్యోగులకు సన్మాన కార్యక్రమం పేరుతో ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. ప్రతి నెల డిపోలో అధిక కేఎంపీఎల్, ఆదాయం సాధించిన సిబ్బందికి నగదు బహుమతులు అందిస్తున్నారు. ప్రయాణికులను గౌరవించాలనే లక్ష్యంతో సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందించి, మేమున్నామంటూ వారిలో భరోసా నింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్టీసీలో ప్రయాణికుల కోసం గిఫ్ట్ స్కీమ్‌లు అమలు చేస్తున్నారు. పండుగలు, వీక్‌డేస్‌లలో ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.

ప్రత్యేక టూర్లతో పెరిగిన ఆదాయం: వేసవి సెలవుల్లో ఆలయ దర్శనం పేరిట శ్రీశైలం, అరుణాచలం, ఊటీ, నెల్లూరులోని షార్ సెంటర్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపారు. దీంతో డిపోల్లో ఆదా యం పెరిగింది.

రికార్డు స్థాయిలో ఆదాయం: మదనపల్లె వన్ డిపోకు మే నెలలో రికార్డు స్థాయిలో ఆదాయం వచ్చింది. డిపో ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఇంత ఆదాయం రాలేదు. మే నెలలో 502.63 లక్షలు ఆదాయం రావడం విశేషం.



అరుణాచలానికి స్పెషల్ బస్సు (ఫైల్‌ఫొటో)

మే నెలలో డిపోల పరిధిలో వచ్చిన ఆదాయం

డిపో పేరు	ఓఆర్	ఈపీకే	ఆదాయం
మదనపల్లె వన్	76.12	40.87	రూ.502.63 లక్షలు
మదనపల్లె టు	72	40.29	రూ.434.41 లక్షలు
పీలేరు	73	38.95	రూ.410.32 లక్షలు
రాజంపేట	71	40.18	రూ.349.60 లక్షలు
రాయచోటి	71	39.94	రూ.554.31లక్షలు

సమష్టి కృషి ఫలితం



ఆర్టీసీ చైర్మన్, ఎండీ, జిల్లా ప్రజా రవాణాధికారుల సూచనల మేరకు వేసవిలో ప్రత్యేక బస్సులు నడిపాం. సూపర్‌వైజర్లు, సిబ్బందితో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ రద్దీ మేరకు బస్సులు తిప్పాం. ప్రతి ఒక్కరూ బాగా పని చేసి, ఎక్కువ మంది ప్రయాణికులను బస్సుల్లో ఎక్కించుకోవటంతో ఎక్కువ ఆదాయం ఆర్జించగలిగాం.

–మూరే వెంకటరమణారెడ్డి, వన్‌డిపో మేనేజర్, మదనపల్లె

సీపీ బ్రౌన్ కేంద్రానికి మహర్దశ

కడప నగరంలోని ప్రతిష్టాత్మక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం విస్తరణ, స్థలసేకరణ, భవన నిర్మాణాలకు సంబంధించి సవరించిన అంచనాలతో రూ.6,87,40,000 నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోనే అతిపెద్ద గ్రంథాలయాల్లో ఒకటిగా పాఠకులు, పరిశోధకులకు సేవలందిస్తున్న బ్రౌన్ కేంద్రానికి మహర్దశ పట్టనుంది.

- రూ.6.87 కోట్ల నిధులకు పరిపాలన అనుమతులు
- స్థలసేకరణ, జీ ప్లస్ 2 నిర్మాణానికి వినియోగించుకునేలా ఉత్తర్వులు
- హర్షం వ్యక్తం చేసిన అధికారులు



సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం సవరించిన అంచనాలతో రూ.6,87,40,000 నిధులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జీఓ నంబర్ 40 విడుదల చేసింది. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని విస్తరించడంలో భాగంగా 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.5.5 కోట్ల అంచనాలతో స్థలసేకరణ, నూతన భవన నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం పలు సాంకేతిక కారణాల వలన నిధులు రావడం ఆలస్యం అయింది. అయితే ప్రస్తుత వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలు నిధులు రావడంలో గల సాంకేతిక ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి నిధులు సాధించడంలో సఫలీకృతులయ్యారు. ఇందుకోసం కడప పార్లమెంట్ సభ్యుడు వై.ఎస్. అవినాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వి. విజయరామరాజు, కడప ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి సైతం చక్కటి సహకారం అందించడంతో నిధుల విడుదలకు మార్గం సుగమమైంది. దీంతో గతంలో ప్రకటించిన రూ. 5.5 కోట్లకు అదనంగా రూ. 1.30 కోట్లు పెంచి, సవరించి రూ. 6.87,40,000 విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పెంచిన అంచనాల ప్రకారం రూ. 3,21,40,000 నిధులు స్థల సేకరణకు, 3,66,00,000 నిధులను నూతన భవన నిర్మాణానికి వినియోగించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా గతంలో సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి స్థలం ఉచితంగా అందజేసిన కృష్ణస్వామి, సంపత్‌కుమార్ కుటుంబసభ్యులు మరోసారి తమ దాతృత్వం చాటుకుని ముఖ్యమంత్రి సమక్షంలో ఎంతో విలువైన 5 సెంట్ల భూమిని ఇచ్చేందుకు అంగీకరించి రిజిస్ట్రేషన్ చేయించడం విశేషం. తాజాగా ఉత్తర్వులతో మరో 10 సెంట్లను ప్రస్తుత బ్రౌన్ కేంద్రానికి అనుకుని ఉన్న స్థలాన్ని కొనుగోలు చేసేందుకు మార్గం సుగమమైంది. దీంతో రానున్న రోజుల్లో మహిళా గ్రంథాలయం, చిన్నారుల గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్న వైవీయూ అధికారుల ప్రణాళికలకు రెక్కలొచ్చినట్లయింది. సీపీ బ్రౌన్ కేంద్రానికి నిధుల విడుదలలో సహకరించిన ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ , రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం. మల్లికార్జునరెడ్డిలు ధన్యవాదాలు తెలిపారు.

వీలైనంత త్వరగా నిర్మాణ పనులు



వైవీయూ అనుబంధ సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, గ్రంథాలయం అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.6.87 కోట్లు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉంది. మంజూరైన నిధులతో తొలుత స్థల సేకరణ చేపట్టి, వీలైనంత త్వరగా నిర్మాణ పనులను ప్రారంభిస్తాం. – ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్, వైవీయూ



క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యల కారణంగా వివాహిత ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. తట్టివారిపల్లెకు చెందిన మునెప్ప భార్య మహేశ్వరి (30) కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

గుర్రంకొండ : డిగ్రీ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన గుర్రంకొండలో జరిగింది. మండలంలోని సరిమడుగు పంచాయతీ క్రిష్టాపురం గ్రామానికి చెందిన పాలకుంట రెడ్డెప్ప కుమార్తె సాయిరేఖ(18) గుర్రంకొండ పట్టణంలోని ఓ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 13న కళాశాలకు వెళుతున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. అయితే సాయంకాలం కళాశాల సమయం ముగిసినా ఇంటికి చేరుకోలేదు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు విద్యార్థిని ఆచూకీ కోసం గాలించినా జాడ తెలియరాలేదు. విద్యార్థిని తండ్రి రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

మదనపల్లె : బైక్ అదుపు తప్పి ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. వాల్మీకిపురం మండలం బజారువీధికి చెందిన షేక్ అమానుల్లా(21), షేక్ నవాజ్(23) ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై పుంగనూరుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు వద్ద అకస్మాత్తుగా వీరి వాహనానికి మరో ద్విచక్ర వాహనం అడ్డు రావడంతో.. తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో గాయపడిన షేక్ అమానుల్లా, షేక్ నవాజ్‌ను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో..

పెద్దతిప్పసముద్రం : విద్యుత్ షాక్‌తో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపురం వద్ద కర్ణాటక రాష్ట్రం చేలూరుకు చెందిన శంకర్ (50) అనే వ్యక్తి వృక్షాలు కొనుగోలు చేశాడు. ఈ నేపథ్యంలో పైనున్న విద్యుత్ వైర్లు గమనించకుండగా వృక్షాలను కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లారు.

నాడు ఘనం.. నేడు దైన్యం

- చరిత్రలో కలిసిపోయిన హార్సిలీహిల్స్ పట్టు కేంద్రం
- 40 ఏళ్ల క్రితం ఉత్పత్తి చేసిన గూళ్లు, దారం చిత్తూరు తరలింపు
- ఉమ్మడి రాష్ట్ర పట్టు రైతాంగానికి విశేష సేవలు
- శాశ్వత సెలవు తీసుకున్న పట్టు కేంద్రం



మూతపడిన పట్టు కేంద్రం



కేంద్రంలోని పట్టుదారం (ఫైల్)

బి.కొత్తకోట : పట్టు ఉత్పత్తిలో రికార్డులు మూటగట్టుకొన్న బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ మూలబీజ క్షేత్ర కేంద్రం (పీ–3స్టేషన్) చరిత్ర భావితరాలకు తెలియని స్థితిలో పడింది. సమైక్య రాష్ట్రంలోని పట్టురైతులకు అత్యంత విలువైన సేవలందించిన ఈ కేంద్రం మూతపడి ప్రాభవాన్ని కోల్పోగా నిరుపయోగమైంది. హార్సిలీహిల్స్‌పై 1981 మే 5న అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ కేసీ.అబ్రహం పట్టుకేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన పట్టు గుడ్లు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతాంగానికి సరఫరా చేయడం ప్రధాన ఉద్దేశం. ఇక్కడి చల్లటి ఆరోగ్యకరమైన వాతావరణంలో గుడ్ల ఉత్పత్తికి అనుకూలమైంది కావడంతో మంచి నాణ్యతతో కూడిన ఫలితాలు వచ్చేవి. మండలంలోని బయ్యప్పగారిపల్లె పంచాయతీ మొగసాలమర్రి వద్దనున్న ఫారం నుంచి ఆకులు తరలించే వారు. కర్ణాటకలోని మైసూరు సెంట్రల్ సెరికల్చర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అందజేస్తున్న పి–3 రకాన్ని ఇక్కడ అభివృద్ధి చేసి పీ–2 రకాన్ని తయారు చేయడం కోసం చైనా, థాయ్‌లాండ్, జపాన్, కొరియా దేశాలు అనుసరించే పద్ధతులను అవలంబించారు. హార్సిహిల్స్‌పై ఉత్పత్తి చేసే పీ–2 రకం గుడ్లను ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా జరిగేది. ఈ గుడ్లతో పట్టు ఉత్పత్తి జరిగేది. వేలాది ఎకరాల్లో రైతులు మల్బరీ సాగుచేసేవారు. ఈ పట్టు పురుగులకు ఎలాంటి రోగాలు సోకుండా రీలింగ్ నాణ్యత, లార్వా ప్యూపా దశ మారడం, కకున్ బరువు, సిల్క్ బరువు, నాణ్యతగా ఉండేవి. అయితే మారిన వాతావరణ పరిస్థితులు, పట్టు సాగు ప్రభావంతో మొన్నటి దాకా ఒక గదిలో కొనసాగిన కార్యకలాపాలు ప్రస్తుతం పూర్తిగా నిలిపివేయడంతో కేంద్రం పూర్తిగా మూతపడింది.

మిగిలింది గత చరిత్రే

గతమెంతో ఘనకీర్తి కలిగిన ఈ పట్టు కేంద్రం గురించి చెప్పుకోవడానికి ఇప్పుడు మిగిలింది గత చరిత్రే. దీన్ని 1993లో అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్ రెడ్డి సందర్శించారు. ప్రస్తుతం ఇక్కడి భవనాలు, రేరింగ్, చాకీ గదులన్నీ మూసేశారు. ఒక గది పట్టు కేంద్రం గురించిన గత వైభవాన్ని చాటిచెప్పే ప్రదర్శనశాలగా ఉండేది. అప్పట్లో ఉత్పత్తి చేసిన నాణ్యమైన, అత్యధిక బరువు కలిగిన గుడ్లు, వాటితో తయారైన నాణ్యమైన పట్టుదారం ప్రదర్శనలో ఉంచారు. ఇక్కడ సాగు చేసిన మల్బరీ, గుడ్ల ఉత్పత్తికి సంబంధించిన వివరాలతో కూడిన ఫొటోలు, ఛాయ చిత్రాలు ఉండేవి. 40 ఏళ్ల క్రితం నాటి ఈ పట్టుదారం, గుడ్లు పురాతనమైనవి కావడంతో వీటన్నింటిని చిత్తూరులోని జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి తరలించి భద్రపరిచారు.

మూడు ముక్కలాట

35 ఏళ్ల క్రితం ఇక్కడ ప్రారంభించిన పట్టుక్షేత్రానికి చెందిన భవనాలు ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ శాఖలు దీన్ని మూడుముక్కలాట ఆడుకున్నాయి. గత టీడీపీ హయాంలో ఈ భవనాలను క్రీడా శిక్షణ కోసం కేటాయించాలని ప్రతిపాదించారు. అలాగే ఇక్కడ పరిశోధనలు చేయడం కోసం హిందూపురం పట్టుశాఖ పరిశోధనా కేంద్రం కోసం కేటాయింపు చేశారు. తాజాగా ఈ భవనాలు, భూమిని పర్యాటకశాఖకు అప్పగించారు. దీనితో దశాబ్దాలుగా ఓ వెలుగు వెలిగి పట్టు రైతుల కుటుంబాలకు ఆర్థిక ఎదుగుదలకు మూల కారణమైన పట్టు కేంద్రం చరిత్రలో కలిసిపోయింది. ఇప్పుడీ కేంద్రం ముళ్లకంపలు, పొదలతో నిండిపోయింది. సందర్శకులు ఈ ఆవరణలో కూర్చుని విందులు చేసుకుంటూ సేదతీరుతున్నారు. దీనిపై ఏడీ బాబు మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై పట్టు కేంద్ర కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేశామని తెలిపారు.

11 మంది జూదరుల అరెస్టు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం రావడంతో గురువారం అర్ధరాత్రి దాడులు చేశామని ఆయన పేర్కొన్నారు. 11 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,47,590 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టుకు హాజరు పెట్టినట్లు వివరించారు.

భూ తగాదాలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : భూ వివాదం కారణంగా జరిగిన గొడవలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం రాత్రి పీటీఎం మండలంలో జరిగింది. టీ.సదుం పంచాయతీ గుంటుపల్లికి చెందిన చిన్న నరసింహులు, పెద్ద నరసింహులు మధ్య ఒకటిన్నర ఎకరా పొలానికి సంబంధించి వివాదం నడుస్తోంది. అందులో భాగంగా ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. చిన్న నరసింహులుకు మద్దతుగా అతని మేనేల్లుడు శ్రీనివాసులు రాగా.. పెద్ద నరసింహులు కుటుంబ సభ్యులతో కలిసి వారి ఇద్దరిపై దాడి చేశారు. మహిళలు కారంపొడి చల్లగా, పెద్ద నరసింహులు కొడవలితో శ్రీనివాసులు తలపై నరికాడు. ఘటనలో చిన్న నరసింహులు (50), శ్రీనివాసులు(28) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కుటుంబ సభ్యులు బి.కొత్తకోట సీహెచ్‌సీకి తరలించగా మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మదనపల్లె : దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతోపాటు, బెదిరింపులకు పాల్పడి కులం పేరుతో దూషించిన ఘటనలో నిందితుడితోపాటు మరో ఆరుగురు కుటుంబ సభ్యులు, స్నేహితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని కమ్మగడ్డ ఎక్స్‌టెన్షన్‌లో నివాసముంటున్న తేజస్వినికి ఎస్‌బీఐ కాలనీలో నివాసముంటున్న మధుసూదన్‌నాయుడు కుమారుడు రాంచరణ్‌నాయుడు పది నెలల క్రితం పరిచయమయ్యాడు. పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువతిని తీసుకుని బెంగళూరుతోపాటు వివిధ ప్రాంతాలకు వెళ్లాడు. పెళ్లి చేసుకుంటానని తన స్నేహితుల ద్వారా కూడా చెప్పించాడు. ఇటీవల తేజస్విని పెళ్లి చేసుకోవాలని కోరగా.. నిరాకరిస్తూ కులం పేరుతో దూషించాడని, అతని తల్లి మధుర, అన్న నగేష్, వదిన ప్రియాంక, అతని స్నేహితులు ఫారూఖ్, సులేమాన్, బాలుతో కలిసి దౌర్జన్యం చేశారని బాధితురాలు తెలిపారు. అక్రమంగా ఇంటిలోకి ప్రవేశించి కులం పేరుతో తిడుతూ దౌర్జన్యానికి పాల్పడి భయపెట్టాడని పేర్కొన్నారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి రాంచరణ్‌నాయుడు కొంత డబ్బు తీసుకున్నాడని, ప్రస్తుతం ఆ నగదు చెల్లించడానికి నిరాకరిస్తూ దౌర్జన్యానికి పాల్పడినట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొంది. ఈ మేరకు నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ కడుపులో నుంచి కణితి తొలగింపు



తొలగించిన కణితి

రాయచోటి టౌన్ : కడుపు నొప్పి తాళలేక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన మహిళ కడుపులో నుంచి కణితి తొలగించారు. శుక్రవారం పెద్దమండెం కలిచెర్లకు చెందిన గౌరమ్మ (45) కడుపు నొప్పితో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆమెను పరీక్షించి కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆస్పత్రిలోని డాక్టర్లు వేల్పుల శివ, అనిల్ కుమార్ సహకారంతో సుమారు 4–5 కిలోల బరువున్న కణితిని తొలగించారు. ఈ కణితి మరింత పెద్దదిగా మారి పగిలితే క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉండేదని, త్వరగా గుర్తించి తొలగించడం వల్ల ఆమె ఆరోగ్యంగా ఉంటుందని వైద్యులు తెలిపారు. ఇలాంటి ఆపరేషన్ సౌకర్యం రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉందని వైద్యులు పేర్కొన్నారు.

సర్వతోముఖాభివృద్ధి చెందాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యతోపాటు క్రీడలు, కళలను పెంపొందించినప్పుడే విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధి చెందుతాడని సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కడప చెమ్ముమియాపేట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, నిపుణ్ భారత్ ముగింపు కార్యక్రమాన్ని హెచ్‌ఎం మేరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిపై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు జాతీయ భక్తిగీతాల ప్రదర్శన, భగవద్గీత, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ ధనలక్ష్మి, సీఎంఓ కేశవరెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ దశరథరామిరెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ రామాంజనేయులరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలు జరగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న గుంతకల్లు డీఆర్‌ఎం వెంకటరమణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల ఒడిస్సాలో జరిగిన రైలు ప్రమాదంలో వందలాది మంది మృతి చెందారని, అలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని గుంతకల్లు రైల్వే డీఆర్‌ఎం వెంకట రమణారెడ్డి తెలిపారు. గుంతకల్లు డివిజన్‌లోని గుంతకల్లు నుంచి తిరుపతి వరకు రైలు ప్రమాదాల నివారణపై కడప రైల్వేస్టేషన్‌లో శుక్రవారం సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో గుంతకల్లు రైల్వే అధికారులు అక్కిరెడ్డి, మల్లికార్జున, కడప రైల్వే అధికారులు రాధాకృష్ణ, డాక్టర్ శ్రీనివాసులు, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఎస్‌ఎంఆర్ నరసింహారెడ్డి, ఆర్‌పీఎఫ్ సీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నందలూరు రైల్వే క్రూ సెంటర్ తరలించవద్దు

రాజంపేట : బ్రిటీషు కాలం నాటి నందలూరు రైల్వే రన్నింగ్ స్టాఫ్ క్రూ సెంటర్‌ను తరలించవద్దని, నందలూరు రైల్వేకేంద్రాన్ని నిర్వీర్యం చేయొద్దని నందలూరుకు చెందిన నేతలు గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ వెంకటరమణారెడ్డికి విజ్ఞప్తి చేశారు. గుత్తి–రేణిగుంట రైలు మార్గంలో శుక్రవారం పలు రైల్వేస్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ క్రమంలో నందలూరు రైల్వేకేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయపార్టీలకు చెందిన నేతలు ఆయనకు ఈమేరకు వినతిపత్రం అందజేశారు. వెంకటాద్రి, జయంతి, చెన్నై–ముంబై మధ్య నడిచే రైళ్లకు నందలూరులో స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యువనాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి, సర్పంచ్ జంబు సూర్యనారాయణ, ఐకేపీఎస్ అధ్యక్షుడు మస్తానయ్య, రైల్వేసాధన సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : రైలు ప్రయాణంలో ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా వుండాలని గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజరు వెంకటరమణారెడ్డి రైల్వే అధికారులను ఆదేశించారు. శుక్రవారం డీఆర్‌ఎం స్థానిక రైల్వేస్టేషన్‌లో సిబ్బందితో రైల్వే భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముద్దనూరు–జమ్మలమడుగు రహదారిలో రైల్వేగేటు వల్ల ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని, రైల్వేగేటు వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, ఇతర నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజరు భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES

VEHICLE FOR SALE

■ MDH Renault కడప, నెల్లూరు & తిరుపతి షోరూం నందు డెమో కొరకు ఉపయోగించిన గుడ్ కండీషన్‌లో ఉన్న 2022మోడల్ వాహనాలు ఎక్స్ఛేంజి వాహనాలు అమ్మకానికి ఉంచడమైనది. ఫోన్ : 8374644707, 8106093265 [H-780874]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1460]

B.Tech / B.Pharm

■ AP EAPCET ర్యాంకుపై కాకపోయినా / సెట్ రాయకున్నా కాలేజ్ ఫీజు లేదు. ఓన్లీ హాస్టల్ ఫీజుతో B.Tech (ఏనీ బ్రాంచ్), బి-ఫార్మసీ చదివే అవకాశం. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-776720]

REAL ESTATE

PLOTS FOR SALE

■ మీ పిల్లల ఉజ్వల భవిష్యత్ కొరకు ఎర్రచందనం పెంపకంలో అగ్రగామి సంస్థలో తక్కువ పెట్టుబడితో 25 సెంట్లు (భూమి+100 ఎర్ర చందనం మొక్కలు) 7,50,000/- మాత్రమే. సంప్ర: N.G.O. కాలని, కడప. 7396098509. [C-785860]

TO-LET

■ ప్రొద్దుటూరు పట్టణం హోమస్‌పేట బ్యాంక్ ఆఫ్ బరోడ ఎదురుగా విజయ డెంటల్ హాస్పిటల్ బిల్డింగ్ 1st ఫ్లోర్ (1000 Sqft) బాడుగకు (కమర్షియల్) ఇవ్వబడును. సెల్: 9440860670. [C-785806]

SERVICE

పాస్‌పోర్ట్ పోయినది

■ I, GAI REDDY దస్తగిరిరెడ్డి, S/o G. కొండారెడ్డి, R/oF D.No.1/189, అన్నవరం (M&Po), మడూరు, రాపాడు(మం), YSR కడప జిల్లా, A.P. అను వారికి చెందిన పాస్‌పోర్ట్ నెం: E3857562, ఒరిజినల్ పోయినది. దొరికిన వారు తెలుపగలరు. సంప్ర:: 9948803272. [C-785814]

ASTROLOGY

■ శ్రీ దుర్గ దేవి జ్యోతిష్యాలయం : విద్య, ఉద్యోగం, వ్యాపారం, అనారోగ్యం, ఇంట్లో శాంతి, మనశ్శాంతి లేకపోవడం. దరిశంకర్ సిద్ధాంతి గారిని సంప్ర :: శ్రీ జ్యోతిష్యం వాటిని పరిష్కారం చూపబడును. ఫోన్: 91102 35188 [V- 6162]

WANTED

■ కడప శివనేత్ర A/c లాడ్జి నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. జీతం 10,000+ అకామిడేషన్. సంప్ర: TEJA BAR ఎదురుగా, కడప. 9000114931. [C-785813]

■ WANTED TEACHERS Upper Primary School @ Rajampet. Teachers for teaching English, EVS, Maths cont: 8519926394, 9133226225. [C-785863]

■ WANTED TEACHERS for Hindi, Maths, Social and PET Free Accommodation. Cont: 8639096944, 8142660770. [C-785862]

■ C.K. Plywood & Hard Ware నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, వర్కర్స్ కావలెను. Q: 10th to డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం, ప్రొద్దుటూరు. సంప్ర: 9440490804. [C-785812]

■ కడప క్రిస్టియన్‌లైన్ లో చిన్నపిల్లల హాస్పిటల్ నందు గల మెడికల్ షాప్‌లో పనిచేయుటకు10 th, ఇంటర్ పాస్ అయిన వారు కావలెను. 8341222455. [C-784840]

■ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో పనిచేయుటకు కడప టౌన్ నందు డిగ్రీ అర్హత కలిగిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం: 17 వేలు+ఇన్సెంటివ్స్. సంప్ర: 7981635213. [C-1216619]

■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీ నందు 39 మంది స్త్రీ / పురుష ఉద్యోగాలు కలవు. జీ : 14000 + DA 6000 + ఫ్రీ రూమ్ + ఫుడ్ అర్హత 7th to డిగ్రీ, సంప్ర : చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. సెల్ : 9502400350. [A-7563]

■ న్యూ A1ఫ్యాషన్ రెడిమేడ్స్ షాపు నందు పనిచేయుటకు యువతీ, యువకులు కావలెను, ఇది మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలకు మాత్రమే. ✆ 9347925640. [T-747]

■ Wanted B.Com / M.Com / MBA Finance / CA IPCC Dropouts to be work as Field Executive in Kadapa in a reputed audit firm. Interested persons (male only) conatct: 70135 11502 for further information or mail: kowthahr@gmail.com [B-181]

■ Job Vacancy: Age:18 to 30, 10th to Any Degree, Office Job 18000 to 25000/- work from home 15000 to 18000/- ✆ 8712008071. [T-774164]

■ Job Vacancy: Age:18 to 30, 10th to Any Degree, Office Job 18000 to 25000/- work from home 15000 to 18000/- ✆ 7702553782. [T-774165]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమిషన్ 6K. Ph: 9640258899 [H-793444]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీ/పు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్‌బాయ్స్, నర్సులు, వంటవారు.RMP. Dr. Q:5th- Degree, 10-30 వేలు జీతం, భోజనం+రూం ఫ్రీ, Hyd. 7993583999 [HA-308]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి

9705944423
9705907418
9010223797
9010072409

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

- రెండు, మూడు రోజుల్లో రానున్న రుతుపవనాలు
- జిల్లాకు 2636 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు
- ఆర్‌బీకేల ద్వారా పంపిణీ



పెన్నా సమీపంలో మాచుపల్లె వద్ద సాగులో ఉన్న జనుము

కడప అగ్రికల్చర్ : నైరుతి రుతు పవనాలు రాయలసీమను తాకనున్నాయి. మరికొన్ని రోజుల్లో వర్షాలు కురువనున్నాయన్న సూచనలతో రైతులు పొలంబాట పట్టారు. ఈ ఏడాది జిల్లాలో 77,105 హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా ఉండగా.. ఇందులో 33,125 హెక్టార్లలో సాధారణ వరి పంట సాగు కానుందని అధికారులు అంచనాలు తయారు చేశారు. కానీ అంతకంటే ఎక్కువగానే వరి పంట సాగు కానుంది. ఇందులో ముఖ్యంగా కేసీ కెనాల్‌తో పాటు కుందూ, పెన్నా, బోర్ల కింద వరి పంటను సాగు చేయనున్నారు. ఈ మేరకు రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములను సబ్సిడీపై జిల్లాకు 2336 క్వింటాళ్లను అధికారులు కేటాయించారు. సంబంధిత విత్తనాల పంపిణీ జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనసాగుతుంది. ఈ క్రమంలో వాతావరణ అనుకూలతను ఆసరాగా చేసుకుని పచ్చిరొట్ట సాగు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. కేవలం 45 రోజుల వ్యవధిలోనే పచ్చిరొట్ట పూతదశకు చేరుకుంటుంది. వరి నాట్లు వేసే సమయానికి ఈ పంట అదునుకు వస్తుంది. ప్రస్తుతం రసాయనిక ఎరువుల వాడకం గణనీయంగా పెరగడంతో భూమి నుంచి పైరుకు అవసరమైన పోషకాలు లభించడం లేదు. వీటి సాగు వల్ల భూమికి కావాల్సిన పోషకాలు అందనున్నాయి.

ప్రయోజనాలు మెండు

పచ్చిరొట్ట పైరులైన జీలుగ, జనుము, పిల్లపెసర వల్ల సేంద్రియ పదార్థాలు భూమికి లభిస్తాయి. భూమిలో కలుపు మొక్కల నివారణ జరుగుతుంది. దీంతోపాటు మొక్కలకు కావాల్సిన అన్ని పోషకాలు మెండుగా లభిస్తాయి. కృత్రిమంగా వాడుతున్న నత్రజని వినియోగం తగ్గుతుంది. రసాయన ఎరువులు భూమి అంతర పొరలకు చేరిపోకుండా అడ్డుకట్ట వేయవచ్చు. నేలలో చౌడును తగ్గిస్తూ భూ అంతర్ పొరల్లో ఉష్ణోగ్రత సమతుల్యతను కాపాడుతుంది. ముఖ్యంగా చౌడు భూముల్లో జనుము సాగు చేసి సేద్యం చేసుకుంటే మంచిది.

ఎకరాకు ఎంత మోతాదులో..

జీలుగ, పిల్ల పెసర ఎకరాకు 16 కిలోలు, జనుము 20 కిలోల వంతున చేయాల్సి ఉంటుంది. పచ్చిరొట్ట పూత సమయంలో పంట భూమిలో కలియదున్నడంతో నత్రజని 1.8 నుంచి 3.5 శాతం సమకూరుతుంది. భాస్వరం 0.1 నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2.0 శాతం భూమికి లభిస్తుంది. ఈ పచ్చిరొట్ట వల్ల రసాయనిక ఎరువుల వాడకం 30 శాతం మేర తగ్గించుకోవచ్చు. పచ్చిరొట్టతో భూమికి అవసరమైన కాల్షియం, నత్రజని, మాంగనీసు, గంధకం, జింకు వంటి సూక్ష్మ ధాతువులు పుష్కలంగా సమకూరుతాయి. నీటి నిల్వలు భూమి లోపల పొరలలో నిల్వ ఉండి సేద్యానికి సహకరిస్తాయి. భూమి ఆరోగ్యవంతంగా మారుతుంది.

ఆర్‌బీకే ద్వారా విత్తనాలు



పచ్చిరొట్ట సాగుతో భూసారం మెరుగుపడుతుంది. ఆర్‌బీకేల ద్వారా 50 శాతం రాయితీపై విత్తనాలను అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోని పలు రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ సాగుతుంది. ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే విత్తనాలను రైతులు సకాలంలో తీసుకుని చల్లుకోవాలి.

– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి, కడప

ఆకాశవాణికి అరవై ఏళ్లు

- కడప కేంద్రానికి షష్టిపూర్తి
- కళాకారులతో కళకళలాడిన కేంద్రం



కడప ఆకాశవాణి కేంద్రం

కడప కల్చరల్ : ఆకాశవాణి కడప కేంద్రం.. 333.3 మీటర్లు అనగా 900 కిలో హెడ్జ్‌పై ప్రసారం... అంటూ ఓ మృదు మధురమైన స్వరం ఉదయాన్నే సుప్రభాతంలా వినిపిస్తుంది. ఆ వెంటనే కమ్మని సంగీతం చెవిని సోకుతుంది. ఎంత వారికైనా ఆ క్షణంలో నిద్రమత్తు వదిలిపోతుంది. ఆ ఉదయం హుషారుగా గడిచేందుకు తగినంత ఉత్సాహాన్ని ఇస్తుంది. నేటికీ ఈ అనుభూతికి 60 ఏళ్లు.

ఆకాశవాణి కడప కేంద్రం గురించి తెలిసిన, ఆ కేంద్రానికి చెందిన ప్రసారాలు విన్న మొన్నటితరం వారికి పై వ్యాఖ్యానం అనుభవమే. ఈ కేంద్రం 1963లో జిల్లా కేంద్రమైన కడప నగరంలో ప్రారంభమైంది. నాటి కేంద్ర ప్రసారశాఖ మంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. తొలుత ఈ కేంద్రం కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని ప్రైవేటు భవనంలో ఉండేది. 1986లో ఎస్పీ బంగ్లా పక్కన విశాలమైన స్థలంలో సుందరమైన సొంత భవనంలోకి మారింది. 1983లో 100 కిలోవాట్ల ట్రాన్స్‌మీటర్ సామర్థ్యంతో అప్‌గ్రేడ్ అయింది. రాయలసీమతోపాటు సమీప జిల్లాలలో కూడా ఈ కేంద్రానికి చెందిన కార్యక్రమాలు ప్రసారం అయ్యేవి. నాటి ప్రముఖులు మహాకవి, సరస్వతీపుత్ర పుట్టపర్తి నారాయణాచార్యులు, కళాకారులు, సంగీత దర్శకులు, నట గాయకులు కొండపేట కమాల్‌తోపాటు మరికొందరు ప్రజాప్రతినిధులు కడపలో ఆకాశవాణి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తమదైన శైలిలో ఉద్యమించారు. ఆ తర్వాత ఈ కేంద్రం అప్‌గ్రేడేషన్ కోసం మాజీ ఎమ్మెల్సీ షేక్ హుసేన్ తదితరులు పోరాడారు.

కళాకారులతో కళకళ

ఆకాశవాణి కడప కేంద్రం ప్రారంభం నుంచి నిత్యం కళాకారులతో కళకళలాడేది. స్వయంగా నటులు, గాయకులైన ఆరవేటి శ్రీనివాసులు, సినీ నటుడు, రచయిత గొల్లపూడి మారుతిరావు కడప స్టేషన్‌కు బాధ్యునిగా ఉండడంతో ఆయనతో పరిచయం గల జానపద గాయకుడు మునెయ్య లాంటి కళాకారులు ఈ కేంద్రం ద్వారా తమ ప్రతిభను చాటుకునేవారు. అంతేకాకుండా సీమలోని సంగీత, నాటకరంగ కళాకారులు, కవులు, రచయితలు ప్రతిభను చాటుకునేందుకు ఈ కేంద్రం గొప్ప వేదికగా ఉండేది. సీమ గ్రామీణ జీవితంపై మంచి పట్టుగల సుబ్బన్న లాంటి వ్యక్తి గ్రామ సీమలు కార్యక్రమం రూపకర్తగా ఉండడంతో ఆకాశవాణికి గ్రామ సీమల్లో గొప్ప పట్టు ఏర్పడింది. ఇతర ప్రాంతాలకు చెందిన పలు కళారూపాలు, స్థానిక సంప్రదాయ కళలకు చెందిన ప్రసారాలు కూడా విరివిగా అలరించేవి. ఇక్కడి ప్రముఖ రచయితల కవిత్వం ఎంతగానో అలరించేది. ఈ ప్రాంత రంగస్థల నాటకాలు ఈ కేంద్రం ద్వారా ప్రసారమై జాతీయ స్థాయి బహుమతులు సాధించి పెట్టడంతో ఈ కేంద్రం విజయ బావుటాను ఎగురవేసింది. మొన్నటితరంలో చాలా మందికి ఆకాశవాణి ప్రసారాలు వినడం వ్యసనంగా ఉండేది. 2015 వరకు ఆకాశవాణి కడప కేంద్రానికి ప్రముఖ కవి శశిశ్రీ ప్రతినిధిగా వ్యవహరించారు. మొత్తంపై తెలుగు నాట ఆకాశవాణి కడప కేంద్రం విలక్షణమైన కార్యక్రమాలతో ప్రత్యేక గౌరవం సాధించింది. సుదీర్ఘ కాలం ఈ కేంద్రం విజయవంతంగా కొనసాగుతుండడం పట్ల ఆ కేంద్రం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంత గొప్ప కేంద్రంలో తాము సేవలు అందించే అవకాశం లభించినందుకు గర్విస్తున్నామన్నారు. 60 ఏళ్లను పురస్కరించుకుని శనివారం ఉదయం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు.